సాక్షి
ములుగు

శనివారం । 29 । జూలై । 2023



పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రీషెడ్యూల్

కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. - 8లో▸



5 వరకు లా పరీక్షల ఫీజు గడువు

ఆగస్టు 5వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా లా కోర్సు పరీక్షల ఫీజు చెల్లించవచ్చని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
30^0 /25^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతం అయి ఉండి, చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలి

● జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య

ములుగు: వరుస వర్షాలతో ఎక్కడ ఆస్తి ప్రాణ నష్టం జరగకుండా సంబంధిత అధికారులు మండల స్థాయి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గోదావరి నదికి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదలు వస్తున్న కారణంగా అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించే బాధ్యతను పకడ్బందీగా చేపట్టాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గోదావరి బ్యాక్ వాటర్ ద్వారా ఏటూరునాగారం, మంగపేట, వాజేడు , కన్నాయిగూడెం, వెంకటాపురం (కె) ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

తల్లీబిడ్డ సేఫ్



ఏటూరునాగారం: కొండాయికి చెందిన గిరిజన మహిళ వారం రోజుల పసికందుకు జ్వరం రావడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్‌కు సమాచారం ఇచ్చారు. వారు పడవలో తీసుకొచ్చి 108 ద్వారా సామాజిక ఆస్పత్రికి తరలించారు.

రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి



ఏటూరునాగారం: కొండాయి వరదల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఎమ్మెల్యే సీతక్క డిమాండ్ చేశారు. శుక్రవారం దొడ్ల - కొండాయి బ్రిడ్జి వద్దకు చేరుకొని ఆహారం, అరటిపండ్లు, తాగునీటి బాటిళ్లు పడవల ద్వారా అందజేశారు. అనంతరం మృతదేహాల వద్ద రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చారు. వరద ముంపు ఉందని ప్రభుత్వానికి ముందుగా సమాచారం ఇచ్చినప్పటికీ ఎలాంటి సదుపాయాలు అందలేదన్నారు. శుక్రవారం నాటికి వచ్చినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిందని, 8 మందిని కోల్పోయామన్నారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సీతక్క కొండాయి గ్రామానికి తనకార్యకర్తలతో కలిసి వెళ్లి ముంపు బాధితులకు ధైర్యానిచ్చారు. తనవెంట తీసుకెళ్లిన ఆహార ప్యాకెట్లను అందజేశారు. జిల్లా అధ్యక్షుడు అశోక్, ఇర్సవడ్ల వెంకన్న, రఘు, దేవేందర్ పాల్గొన్నారు.

ఆదుకుంటాం



ఏటూరునాగారం: మండలంలోని కొండాయి వరదల్లో చిక్కుకొని మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని రెడ్కో చైర్మన్ సతీష్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ నాగజ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని దొడ్ల వద్ద మృతుల కుటుంబాలను ఓదార్చి మృతదేహాలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం నుంచి సాయాన్ని బాధిత కుటుంబాలను అందించేలా కృషి చేస్తామన్నారు. వరద ఉధృతికి బ్రిడ్జి కొట్టుకుపోవడం బాధాకరం అన్నారు. ముంపు నష్టాన్ని అంచనావేయించే విధంగా అధికారులతో మాట్లాడుతామన్నారు. వైద్య శిబిరాలు, ఆహారం, ఇతర సౌకర్యాలను వెంటనే సమకూర్చుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, నాయకులు ఉన్నారు.

నాయకులను ప్రశ్నించిన బాధితులు

కొండాయిలో వరదలో చిక్కుకున్నారని గురువారం సమాచారం అందిస్తే ఇప్పుడు వచ్చి ఏం చేస్తారని బాధితుడు అన్వర్, తదితరులు రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, నాగజ్యోతిని ప్రశ్నించారు. వరదల విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లామని, కావాల్సిన సౌకర్యాలు, సాయం అందిస్తామని వారు బాధితులకు నచ్చజెప్పి శాంతింపజేశారు.

రహదారులను పునరుద్ధరించండి

ములుగురూరల్: పస్రా వద్ద జాతీయ రహదారి ధ్వంసమై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆర్అండ్‌బీ డీఈ రఘువీర్‌తో మాట్లాడి జాతీయ రహదారి పునరుద్ధరణకు సంబంధించిన పూర్తి నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందచేయాలని తెలిపారు. రాకపోకలకు వీలుగా మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

మంగపేట: బోరునర్సాపురం గౌరారంవాగు తీరంవెంట పంటపొలాల్లో ఇసుకమేటలు



అతలాకుతలం

తెగిన చెరువు కట్టలు

- కొట్టుకుపోయిన రోడ్డు
- నీటమునిగిన పంటలు
- పలువురి మృత్యువాత
- ఆందోళనలో ఆదివాసీలు

ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో ములుగు జిల్లా అతలాకుతలమైంది. పలుచోట్ల చెరువుకట్టలు తెగిపోవడంతో ప్రధాన రహదారులతోపాటు, గ్రామాలు, గూడేలకు వెళ్లే రోడ్లు తెగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరదనీటిలో పలువురు గల్లంతుకాగా.. కొందరి మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి. వరదనీటి ప్రవాహానికి పంటభూములు కోతకు గురికావడంతోపాటు పొలాల్లో ఇసుకమేటవేసింది. మొత్తంగా వర్షాలతో ములుగు జిల్లా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



ఎస్ఎస్ తాడ్వాయి: జంపన్నవాగు వరదతాకిడికి ధ్వంసమైన కల్యాణకట్ట



ఎస్ఎస్ తాడ్వాయి: నార్లాపూర్ వద్ద ధ్వంసమైన రోడ్డు

మేడారం జలమయం

ఎస్ఎస్ తాడ్వాయి: వర్షాలకు జంపన్నవాగు ఉధృతంగా ప్రవహించడంతో మేడారం జలమయమైంది. చిరువ్యాపారుల దుకాణాలు, గ్రామస్తుల ఇళ్లు నీటి పాలయ్యాయి. వరదతో 100కు పైగా దుకాణాల్లోని సరుకులు పూర్తిగా తడిసిపోయాయి. దీంతో వ్యాపారులు కన్నీటి పర్యంతమయ్యారు. వరదలతో మేడారం, రెడ్డిగూడెం గ్రామాల్లో వారం రోజులు గడిస్తేతప్ప వరదల నుంచి తేరుకునే పరిస్థితి కన్పించడంలేదు. మేడారం పరిసరాల్లో చాలామంది కట్టుబట్టలతో మిగిలిన దుస్థితి. శుక్రవారం జంపన్నవాగు వరదలో నుంచి తేరుకోవడంతో దుకాణాలు సర్దుబాటు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పీఏఎస్ఎస్ చైర్మన్ పులి సంపత్ ఇళ్లు పూర్తిగా మొదటి అంతస్తు వరకు నీట మునడంతో సామగ్రి పూర్తిగా పాడయింది. ఇదిలా ఉండగా.. మేడారంలోని పలు కోళ్ల షాపుల్లోని బ్రాయిలర్, నాటు కోళ్లు వరదలకు షెడ్లలోనే చనిపోయారు. కోళ్లు కుప్పలు కుప్పలుగా ఉండటంతో దుర్వాసన వెదజల్లుతుంది. వరదలకు కరెంట్ స్తంభాలు నెలకొరగడంతోపాటు తీగలు కింద పడ్డాయి. కరెంట్ తీగలకు బట్టలు ఆరేసిన విధంగా చెత్త చెదారం కనబడుతుంది. ఇదిలా ఉండగా.. జంపన్నవాగు వరదతో వాగు ఒడ్డున ఉన్న కల్యాణకట్ట షెడ్ ధ్వంసమైంది. షెడ్ రేకులు పగిలిపోయాయి. జంపన్నవాగు బ్రిడ్జి వద్ద రోడ్డు కొట్టుకుపోయింది. నార్లాపూర్ గ్రామ సమీపంలోని పస్రాకు వెళ్లే దారిలో బ్రిడ్జి వద్ద రోడ్డు భారీగా కోతకుగురై గొయ్యి ఏర్పడింది. జంపన్నవాగు అవతల రోడ్డు వరద తాకిడికి కొట్టుకుపోయింది. నార్లాపూర్ బ్రిడ్జి వద్ద కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపడితే తప్ప పస్రా వైపు రాకపోకలు కొనసాగించే అవకాశం లేదు.

8 మందిని కాపాడిన చెట్టు..

జంపన్నవాగు వరద ఒకసారిగా పెరగడంతో వాగు ఒడ్డున దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు 8 మంది రక్షణ కోసం చెట్టును ఎక్కారు. చెట్టుపై వ్యాపారుల గొంతుల వరకు వరద రావడంతో చనిపోతామనే భయాందోళన చెందినా, రెస్క్యూ టీంలు చెట్టు వద్దకు చేరుకొని 8 మందిని కాపాడారు. రెస్క్యూ టీం బృందం రావడం సమ్మక్క సారలమ్మ దీవెనలతోనే ప్రాణాల నుంచి బయటపడ్డామని వరదలో చిక్కుకున్న వ్యాపారులు వాపోయారు.



ఎస్ఎస్ తాడ్వాయి: వరదతో చెట్టుపైకి ఎక్కిన వ్యాపారులను కాపాడుతున్న రెస్క్యూ టీం

కన్నీళ్లే మిగిలాయి..



జంపన్నవాగు వరదతో హోటల్ మొత్తం మునిగిపోయింది. హోటల్‌లోని ఫ్రీడ్జిలు, కూలర్లు, సామగ్రి మొత్తం వరద పాలయ్యాయి. రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకుంటే తప్ప కోలుకోలేని పరిస్థితి నెలకొంది.

\- అరుణ, మేడారం

నష్టాన్ని మిగిల్చింది



జంపన్నవాగు వరద తీవ్ర నష్టం మిగిల్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకసారిగా వరద హోటల్‌లోకి చేరడంతో కుటుంబమంతా కట్టుబట్టలతో బయటికి వెళ్లాం. హోటల్‌కు సంబంధించిన సామగ్రి, ఫర్నీచర్, పూర్తిగా పాడైపోయాయి. ఆర్థికంగా నష్టం పోయాం.

\- ఎండీ రషీద్, హోటల్ యజమాని, మేడారం

మంగపేట: ఏటూరునాగారం- బూర్గంపాడు రోడ్డు



ఏటూరునాగారం: రహదారిపై ఏర్పడిన గుంత



ధ్వంసమైన రోడ్లు

మంగపేట: మండలంలో విస్తారంగా కురిసిన భారీ వర్షాల కారణంగా పలు గ్రామాల్లోని రోడ్లు ధ్వంసమయ్యాయి. రాజుపేట సమీపంలోని కప్పవాగు వరద నీరు బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై నుంచి ఉధృతంగా ప్రవహించడంతో పెట్రోల్ బంక్ వద్ద సుమారు 20 నుంచి 30 మీటర్ల వరకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఏటూరునాగారం– బూర్గంపాడు ప్రధాన రోడ్డు నుంచి కొత్తచీపురుదుబ్బ వరకు ఇటీవల నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు పైనుంచి వరదనీరు పారడంతో సుమారు 15 మీటర్ల మేర రోడ్డు కోతకు గురై భారీ గొయ్యి ఏర్పడింది. తిమ్మంపేట పంచాయతీ పరిధిలోని అబ్బాయిగూడెం గ్రామ రోడ్డు కోతకు గురై సుమారుగా రెండు మీటర్ల వెడల్పు, 5 మీటర్ల పొడవుతో గండి ఏర్పడింది. దీంతో కొత్తచీపురుదుబ్బ, అబ్బాయిగూడెం రెండు గిరిజన గ్రామాలకు రెండు రోజుల నుంచి రవాణా సౌకర్యం పూర్తిగా నిలిచి పోయింది. వ్యవసాయ పనులకు, ఇతర అత్యవసర పనులకు వెళ్లే ప్రజలు పంట పొలాల నుంచి కాలినడకన రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఆయా గ్రామాల్లో వైద్యం అత్యవసరమైతే కనీసం అంబులెన్స్ వెళ్లే పరిస్థితి కూడా లేదు. వాగులు, చెరువుల వరదల కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో పంట పొలా ల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. రాజుపేట, బ్రాహ్మణపల్లి మధ్యనగల కప్పవాగు, రాజుపేట ముసలమ్మవాగు, మండల కేంద్రంలోని గౌరారంవాగుల్లోకి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు ఉప్పొంగి ప్రవహించా యి. వరదనీరు ఎక్కువ కావడంతో తిమ్మంపేట–మల్లూరు మధ్య ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై నిర్మించిన 10 తూముల కల్వర్టు వద్ద కాలువకు గండి ఏర్పడింది. చుంచుపల్లి ఊరచెరువులోకి గడీలగుట్ట, మల్లూరు గుట్టపై నుంచి భారీగా వరద నీరు చేరడంతో మత్తడి పోయడంతో పంట పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. దీంతో మండల వ్యాప్తంగా సుమారు 100 ఎకరాల సాగు భూముల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి.

ఇళ్లమధ్యనే వరదనీరు

వాజేడు: వాజేడు మండలంలో గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. పల్లపు ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు పలు చోట్ల రహదారుల పైకి చేరింది. వాజేడు మండల కేంద్రం నుంచి గుమ్మడిదొడ్డి, సుందరయ్యకాలనీ, చీకుపల్లి గ్రామాల వరకు గోదావరి వ్యాపించి ఉంది. బాడువాలోని చేలు మొత్తం మునిగిపోయాయి. టేకుల గూడెం సమీపంలో జాతీయ రహదారి ముంపునకు గురి కావడంతో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలమధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చీకుపల్లి పెద్దగొళ్ల గూడెం మధ్య జాతీయ రహదారి పైకి వరద నీరు చేరింది. వాజేడు గుమ్మడి దొడ్డి గ్రామాల మధ్య మూడు కిలో మీటర్ల మేర రోడ్డును వరద ముంచెత్తింది. ఎడ్జర్లపల్లి, పూసూరు గ్రామాల మధ్య రహదారిపై నుంచి వరద ప్రవహిస్తుంది. కోయ వీరాపురానికి వెళ్లే రహదారి నీటిలోనే ఉంది. పేరూరు, కృష్ణాపురం గ్రామాల రహదారి మునిగిపోయింది.



వాజేడు: ఇళ్లమధ్య నిలిచిన వరదనీరు

కొట్టుకుపోయిన జాతీయ రహదారి

ములుగు: భారీగా కురిసిన వర్షాలతో ములుగు మండలం మహమ్మద్ గౌస్‌పల్లి నుంచి ఏటూరు నాగారం వరకు జాతీయ రహదారి పలుచోట్ల కొట్టుకుపోయింది. గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలో సమీపంలో రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో పాటు లవ్వాల స్టేజీ ప్రాంతంలో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ములుగు మండలం జంగాలపల్లి సమీపంలో రహదారికి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో మంత్రి సత్యవతి రాథోడ్, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు మరమ్మతులు చేపడుతున్నారు. ములుగు మధ్యలోనీ పానేసా కు కాలువపై నుంచి భారీ వరద వెళ్లడంతో గుంత ఏర్పడింది.

పునరావాస కేంద్రం పరిశీలన

వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు, జగన్నాథపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను శుక్రవారం ఏటూర్‌రునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్ పరిశీలించారు. గోదావరి వరద ఉధృతంగా పెరుగుతుండటంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం రాత్రి కడేకల్ గ్రామానికి చెందిన 363 మందిని పేరూరు ఎస్సై అశోక్, తహసీల్దార్ సయ్యద్ సర్వర్, మండల ప్రత్యేక అధికారి సర్దార్ సింగ్ ట్రాక్టర్లపై చెరుకూరు రైతు వేదికలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఇప్పగూడెం, సుందరయ్య కాలనీ గ్రామాలకు చెందిన 105 మందిని జగన్నాథపురంలోని పునరావాస కేంద్రానికి తరలించారు. వాజేడుకు వచ్చిన పీఓ రెండు కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్, తహసీల్దార్ సయ్యద్ సర్వర్, వాజేడు ఎస్సై వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న పీఓ

భారీ వర్షాలతో ఎన్పీడీసీఎల్‌కు రూ.20కోట్ల నష్టం

● టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు


బిక్కుబిక్కుమంటూ గడిపాం

మిన్నంటిన రోదనలు

\- 8లో▶


\- మరిన్ని ఫొటోలు 9లో▶

పెరుగుతున్న గోదావరి



రామన్నగూడెం వద్ద గోదావరి నీటి మట్టం

ఏటూరునాగారం: ఎగువ ప్రాంతాల్లో బ్యారేజీల నుంచి విడుదల అవుతున్న వరద నీరు గోదావరిలో చేరడంలో మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీటి మట్టం శుక్రవారం రాత్రి వరకు 16.26మీటర్లకు చేరింది. మొదటి ప్రమాద హెచ్చరిక 14.83 మీటర్లు, 15.83 రెండో ప్రమాద హెచ్చరిక, మూడో ప్రమాద హెచ్చరిక 17.36 మీటర్లకు చేరితే ముంపు ప్రాంతాల బాధితులను అధికారులు ఖాళీ చేయిస్తారు. అంతేకాకుండా జంపన్నవాగు సైతం వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో 163 జాతీయ రహదారి రోడ్డు కొంతమేర కొట్టుకుపోయి రైలింగ్ ఊడిపోయింది. ఆ గొయ్యి ప్రమాదకరంగా మారింది. చెల్పాక రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో మండలంలోని రాంనగర్, లంబాడీతండా, అల్లంవారిఘణపురం, వీరాపురం, బన్నాజీబంధం, ఎలిశెట్టిపల్లి, కొత్తూరు. చెల్పాక గ్రామాలకు రవాణా పూర్తిగా నిలిచిపోయింది. మండల ప్రత్యేక అధికారిణి, సీఈఓ ప్రసూనరాణి, ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ వీరస్వామి, పంచాయతీ కార్యదర్శులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా.. గోదావరి వెంట నిర్మించిన కరకట్టకు ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేయిస్తున్నారు. ఈఈ జగదీష్, డీఈఈ నవీన్ పనులను పరిశీలించారు.



సమ్మక్క సాగర్‌వద్ద గోదావరి

సమ్మక్క సాగర్ ఉగ్రరూపం

కన్నాయిగూడెం: తుపాకులగూడెం వద్ద గోదావరి పై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ ఉగ్రరూపం దాల్చింది. ఎగువన ఉన్న సరస్వతి, లక్ష్మీ బ్యారేజీలతో పాటు మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో గోదావరిలోకి భారీగా వరదనీరు చేరడంతో సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి 14,42,380 లక్షల క్యూసెక్కుల నీరు చేరడంతో బ్యారేజీలో ఉన్న 59 గేట్లు ఎత్తి నీటిని ఎత్తి ఆదేమోతాదులో దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీలో నీటి మట్టం 85.32మీటర్లు కొనసాగుతుంది. దేవాదుల ఎత్తిపోతల వద్ద 87.70 మీటర్లు ఉన్నట్లు తెలుస్తుంది.

జిల్లాకు రూ.కోటి కేటాయింపు

మృతుల కుటుంబాలకు రూ.4లక్షల చొప్పన పరిహారం

- తక్షణ సాయంగా ఐటీడీఏ నుంచి రూ.25వేలు
- విలేకరుల సమావేశంలో మంత్రి సత్యవతి రాథోడ్



పస్రా సమీపంలో కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి, ఎంపీ కవిత, అధికారులు

ములుగు: గత నాలుగు రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి కేటాయించినట్లు రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. అధికారికంగా ఇప్పటివరకు ఎనిమిది మంది మృతి చెందారని వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున అందిస్తామని తెలిపారు. తక్షణ సాయం కింద ఎటూరునాగారం ఐటీడీఏ నుంచి రూ.25వేలను అందిస్తామన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా వెంకటాపురం (ఎం) మండలంలోని లక్ష్మీదేవిపేటలో 64.4 సెంటీమీటర్ల వర్షం కురవడం చారిత్రాత్మకమన్నారు. జిల్లాలోని ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న వారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 1000 మందిని తరలించిందని తెలిపారు. ఏటూరునాగారం మండలంలోని కొండాయి గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుందని అక్కడి ప్రజలను కాపాడేందుకు సీఎం కేసీఆర్ చొరవతో రెండు హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. నిరాశ్రయులకు నిత్యవసర సరుకులను అందిస్తామన్నారు. గోవిందరావుపేట మండలంలోని ప్రాజెక్టు నగర్, వెంకటాపురం(ఎం), కొండాయి, ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో కొంతమంది వరదలో కొట్టుకుపోవడం బాధాకరమన్నారు. మారుమూల ప్రాంతాల ప్రజలను కాపాడాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క సీఎం కేసీఆర్ తో పాటు తనకు ఫోన్ చేసినట్లు తెలిపారు. దీనిపై స్పందించి రెండు హెలికాప్టర్లు 100 ట్రిప్పులు తిరిగే విధంగా ఫ్యూయల్‌తో వరంగల్‌లో అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా కొట్టుకుపోయిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. జలదిగ్బంధంలో ఉన్న వారిని కాపాడడానికి ఏటూరునాగారం గోదావరి పరివాహక ప్రాంతంలో ఎమ్మెల్యే సీతక్క, ఎస్పీ గౌష్ ఆలం, జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, అశోక్ కుమార్, ఐటీడీఏ పీఓ అంకిత్ కుమార్ సిద్ధంగా ఉన్నారన్నారు. అమెరికాలోని అమెజాన్ అటవీ ప్రాంతంలో 300 సెంటీమీటర్ల వర్షం పడినట్లు విన్నామని, ములుగు జిల్లాలో ఇంతటి వర్షపాతం నమోదు కావడం ఆశ్చర్యకరం అని అన్నారు. చేపల వేటకు వెళ్లే వారిపై అవసరమైతే కేసులు నమోదు చేయాలని అడ్డుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఆదేశించారు. కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో గోదావరి రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తుందని, అధికారులు స్థానికంగా ఉండి చర్యలు తీసుకోవాలన్నారు. భూపాలపల్లి జిల్లా మొరంచపల్లిలో 600 మందిని సకాలంలో కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించడం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. మంత్రి వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ప్రత్యేక అధికారులు కృష్ణాదిత్య, గౌతమ్ పొట్రూ, కలెక్టరేట్ ఏఓ విజయభాస్కర్ ఉన్నారు.

రహదారి పునరుద్ధరించాలి

భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పస్రా, ఏటూరునాగారం జాతీయ రహదారి పునరుద్ధరణ పనులను చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశించారు. శుక్రవారం గోవిందరావుపేట మండలంలోని పస్రా– ఏటూరునాగారం మధ్యలో కొట్టుకుపోయిన జాతీయ రహదారిని మహబూబాబాద్ ఎంపీ కవిత రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణా ఆదిత్య, కలెక్టర్ ఇలా త్రిపాఠి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్‌నాయక్ పరిశీలించారు. మంత్రి వెంట ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, డీపీఓ వెంకయ్య, ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

కేటీపీపీ పంపుహౌస్‌కు చేరిన వరద



కేటీపీపీ పంపుహౌస్ మోటార్ల సమీపానికి చేరిన వరద

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మెట్‌పల్లి వద్ద గోదావరిని ఆనుకొని నిర్మించిన కేటీపీపీ పంపుహౌస్ వద్దకు వరద ఉధృతి చేరింది. శుక్రవారం రాత్రి మోటార్ల వద్దకు చేరుతున్నట్లు తెలిసింది. వరద పెరిగితే మోటార్లు, కంట్రోల్‌రూం ప్యానల్ బోర్డుల వద్దకు వచ్చే అవకాశం ఉందని తెలిసింది. గతేడాది జూలై 14న ఎలక్ట్రిక్ కంట్రోల్ రూం మునిగిన విషయం తెలిసిందే.

కేయూ బాటనీ విభాగం అధిపతిగా లక్ష్మారెడ్డి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని బాటనీ విభాగం అధిపతిగా ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో బాటనీ విభాగంలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.లక్ష్మారెడ్డిని నియమించారు. శుక్రవారం కేయూ వీసీ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య మహ్మద్ ముస్తాఫా పదవీకాలం ముగియటంతో ఆయన స్థానంలో లక్ష్మారెడ్డిని నియమించారు. ఒక టి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఇద్దరు రెగ్యులర్ అధ్యాపకులు...

కాకతీయ యూనివర్సిటీలో బాటనీ విభాగంలో ఇద్దరు రెగ్యులర్ అధ్యాపకులుగా ప్రొఫెసర్ మహ్మద్ ముస్తాఫా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలితకుమారి ఉన్నప్పటికీ హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలోని కాంట్రాక్టు లెక్చరర్ లక్ష్మారెడ్డిని క్యాంపస్‌లో బాటనీ విభాగం అధిపతిగా నియమించడం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. యూనివర్సిటీలో చరిత్రలో ఓ విభాగం అధిపతి కాంట్రాక్టు లెక్చరర్‌ను నియమించటం ఇది తొలిసారి. ఇప్పటికే క్యాంపస్‌లో విద్యాకళాశాలలో, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవటంతో ఆ కళాశాలకు ప్రిన్సిపాల్స్‌గా కాంట్రాక్టులెక్చరర్లకే అప్పగించారు.

మొగుళ్లపల్లి : ముల్కలపల్లి-కొర్కిశాల రోడ్డు



మొగుళ్లపల్లి : రంగాపూర్-ఇస్సిపేట రోడ్డు



గణపురం : నగరంపల్లి వద్ద తెగిన రోడ్డు



దంతాలపల్లి : గండిపడిన సీసీ రోడ్డు



రోడ్లు ధ్వంసం.. ఇసుక మేటలు

నాలుగు రోజులు కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లడడమే కాకుండా చెరువులు, కుంటలు మత్తళ్లు పడ్డాయి. కొన్ని చోట్ల గండిపడ్డాయి. శుక్రవారం కాస్త వర్షం తగ్గినా వరదలు మాత్రం ఆగడం లేదు. ప్రధాన రహదారులపై కొన్ని చోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి. కాలనీలు, ముంపు ప్రాంతాల్లో వరద నీరు తగ్గకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పంట చేలల్లోకి నీరు చేరడంతో పంటలు నీట మునగడమే కాకుండా పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

- సాక్షి నెట్‌వర్క్



మరిపెడ రూరల్ : పత్తిలో నిలిచిన వర్షపు నీరు



కమలాపూర్ : శివాలయంలోకి ఉబికి వస్తున్న నీటిలో నంది విగ్రహాలు



నయీంనగర్ : నయీంనగర్ బ్రిడ్జి వద్ద ధ్వంసమైన రోడ్డు



పాలకుర్తి : లక్ష్మీనారాయణపురంలో వరిపొలాల్లో ఇసుక మేటలు



చిన్నగూడూరు : వరద ఉధృతికి చెల్లాచెదురుగా పడి ఉన్న కంపోస్ట్ యార్డ్, వైకుంఠధామాలు



ములుగు : రోడ్డు వెంట ప్రవహిస్తున్న వరద



జవహర్ కాలనీలో వరద ముంపునకు గురైన మహ్మద్ ఖాదర్ పాషా గృహం



మల్హర్ : వల్లెకుంట పొలాల్లో ఇసుక మేటలు



పరకాల: తెగిన పరకాల-భూపాలపల్లి రోడ్డు



వర్ధన్నపేట : కోనారెడ్డి చెరువు కట్ట



బచ్చన్నపేట : బొందుగల రోడ్డుపై తెగిన కల్వర్టు



మంగపేట : వరద కోతకు గురైన రోడ్డు

భారీ వర్షాలతో ఎన్పీడీసీఎల్‌కు రూ.20 కోట్ల నష్టం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ ఛైర్మన్, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు
- ముంపు ప్రాంతాల సబ్‌స్టేషన్ల పరిశీలన

హన్మకొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు రూ.20 కోట్ల నష్టం జరిగిందని టీఎస్ ఎన్పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని వరద తీవ్రతతో ముంపునకు గురైన యాదవనగర్, గోపాల్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్లను సందర్శించారు. అదేవిధంగా కాకతీయ కాలనీలో తెగిపడిన లైనును పరిశీలించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ నీట మునిగిన సబ్‌స్టేషన్లతో విద్యుత్ అంతరాయం కలిగిన కాలనీలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. హనుమకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి జిల్లాలో అతి భారీవర్షాల వల్ల వేలాది స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, వందలాది కిలోమీటర్ల లైన్లు దెబ్బతిన్నాయని వివరించారు.



యాదవనగర్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ గోపాల్‌రావు

ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున స్పెషల్ ఆఫీసర్లను, కాంట్రాక్టు ఏజెన్సీలను నియమించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఉద్యోగులు, సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి విద్యుత్ సరఫరా అందించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. చాలాచోట్ల విద్యుత్ సరఫరా అందించామని, మిగతా ప్రాంతాల్లో త్వరలో పునరుద్ధరణ పనులు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హనుమకొండ ఎస్‌ఈ వెంకటరమణ, డీఈ జి.సాంబరెడ్డి, ఏడీఈలు దర్శన్‌కుమార్, కిషన్, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆగస్టు 5 వరకు లా పరీక్షల ఫీజు గడువు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల లా కోర్సు రెండో, నాల్గో, ఆరవ సెమిస్టర్ పరీక్షలకు, ఐదేళ్ల లా కోర్సు రెండో, నాల్గవ, ఆరవ, 8వ, 10వ సెమిస్టర్ పరీక్షలకు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంటు) విద్యార్థులు ఆగస్టు 5 వరకు ఎలాంటి అపరాద రుసుము లేకుండా పరీక్షల ఫీజులు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఒక ప్రకటనలో కోరారు. రూ 250 అపరాధ రుసుముతో 8 వరకు గడువు ఉందన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు ఫీజు రూ.1030, మూడేళ్ల ఆరవ సెమిస్టర్, ఐదేళ్ల 10వ సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు రూ.1360, బ్యాక్ లాగ్స్ రెండు పేపర్లకు పైన ఫీజు రూ.930, రెండు పేపర్ల వరకు రూ.400, ఇంప్రూవ్‌మెంటు ప్రతి పేపర్‌కు రూ 300ల చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాల్సింటుందని వారు పేర్కొన్నారు.

వరదలకు కొట్టుకొచ్చిన మృతదేహాలు లభ్యం



వరదనీటిలో శ్రీను మృతదేహం

రామన్నపేట : నగరంలోని రామన్నపేటలో రిక్షా తొక్కుతూ జీవనం సాగించే నరంశెట్టి శ్రీను (40) మృతదేహం వరదల తాకిడికి రామన్నపేట ఎస్సీ కాలనీలో లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం కురిసిన భారీవర్షం వరదలకు కాలనీ అంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. శుక్రవారం ఉదయం కాలనీ వాళ్లు నిద్రలేచేసరికి కాలనీలో నీటిలో శ్రీను మృతదేహం కనిపించిందని తెలిపారు. మృతుడి స్వగ్రామం నర్సంపేట మండలం గుండ్రాయిపల్లి గ్రామంగా గుర్తించారు. అత్తగారిల్లు కీర్తినగర్. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్ల ఉన్నారని తెలిపారు. పోలీసులు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గోపాలపురంలో యువకుడు..

హసన్‌పర్తి: వరదల్లో గల్లంతైన టీఎన్జీవోస్ కాలనీ-2కు చెందిన గట్టు రాజు మృతదేహం గోపాలపురం చెరువులో శుక్రవారం లభ్యమైంది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై విజయ్‌కుమార్ సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రాజు మృతదేహాన్ని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సందర్శించి కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన వెంట బీజేపీ, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్, ఎఫ్‌సీఐ బోర్డు సభ్యుడు సురేందర్‌గౌడ్, అనిల్ ఉన్నారు. అలాగే గట్టు రాజు మృతదేహాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్ సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబాన్ని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, నాయకులు చింత రమేష్, పెద్ద రాజు, సయ్యద్ ఉమర్ పాషా, తదితరులు ఉన్నారు.

మడికొండ శివారులో..



వెంచర్‌లో లభించిన గుర్తుతెలియని మృతదేహం

మడికొండ: కాజీపేట మండలం మడికొండ శివారులోని ప్రైమ్ సిటీ వెంచర్‌లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మడికొండ శివారులోని వెంచర్‌లో శుక్రవారం సుమారు (50) సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తుతెలియని మృతదేహాన్ని వెంచర్ సూపర్ వైజర్ తొట్టె తిరుపతి గురువారం వచ్చిన వరదలకు ప్రహరీ కూలిపోగా శుక్రవారం వెంచర్‌ను పర్యవేక్షిస్తుండగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వేణు తెలిపారు. మృతదేహంపై ఎలాంటి ఆనవాళ్లు లేవన్నారు. ఎవరైనా అచూకీ తెలిస్తే మడికొండ ఇన్‌స్పెక్టర్ 87126 85123, సబ్ ఇన్‌స్పెక్టర్ 87126 85248 నంబర్లలో సమాచారం అందించాలని పేర్కొన్నారు.

తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్‌ల రీషెడ్యూల్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే హైదరాబాద్-న్యూఢిల్లీ వెళ్లే తెలంగాణ సూపర్‌ఫాస్ట్, సికింద్రాబాద్-దానాపూర్ వెళ్లే పాట్నా ఎక్స్‌ప్రెస్‌ను శుక్రవారం రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం వర్షాల కారణంగా కాజీపేట వడ్డేపల్లి రైల్వేట్రాక్ వద్దకు వరదనీరు చేరడంతో పలు రైళ్లను అధికారులు రద్దు చేసి దారి మళ్లించారు. ఈ ఘటనతో తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్‌లను రీ షెడ్యూల్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కోయంబ్రా-యశ్వంత్‌పూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్, రక్సోల్-సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను వయా విజయనగరం, విజయవాడ మీదుగా దారి మళ్లించారు. కాజీపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ నుంచి రైల్వే టీటీఈలు ప్రయాణికులను రైళ్లలో పంపేలా చేశారు.

ప్లాట్‌ఫాంలో నీరు తొలగింపు

కాజీపేట రైల్వేస్టేషన్‌లో 1వ నంబర్ ప్లాట్‌ఫాం నిండా గురువారం వర్షం నీరు చేరడంతో పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. దీంతో శుక్రవారం రైల్వే అధికారులు ప్లాట్‌ఫాంలోకి చేరిన నీటిని బయటికి పంపించారు.

చెరువుగా రైల్వే స్టేడియం

కాజీపేట రైల్వే స్టేడియంలోకి వర్షం నీరు పెద్ద ఎత్తున చేరవడంతో చెరువును తలపించింది. ఇటీవల సుమారు రూ.35 లక్షలతో రైల్వే స్టేడియాన్ని అత్యాధునీకరించారు. కానీ వర్షం నీరు బయటికి వెళ్లేందుకు డ్రెయినేజీ సిస్టం లేకపోవడంతో వర్షం పడినప్పుడల్లా నీరు చేరుతుంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగాతో నీరు చేరడంతో స్టేడియం అంతా నిండి ఉంటుంది.

మిన్నంటిన రోదనలు



అజహర్ మృతదేహం



మజీద్‌ఖాన్ మృతదేహం



షరీఫ్ మృతదేహం



రషీద్ మృతదేహం



కరీమా మృతదేహం



లాల్‌బీ మృతదేహం



సమ్మక్క మృతదేహం



మహబూబ్‌ఖాన్ మృతదేహం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో కొండాయి నుంచి మల్యాలకు వెళ్తున్న క్రమంలో కల్వర్టు తెగి 15 మంది వరదలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఇందులో 8 మంది మృతదేహాలు శుక్రవారం లభ్యమయ్యాయి. దీంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ పాపమంతా కల్వర్టు నిర్మించిన కాంట్రాక్టర్‌దేనని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు పెట్టాలని పరామర్శకు వచ్చిన జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతితో తల్లిదండ్రులను కోల్పోయిన రషీద్, కరీమా కుమారుడు రఫీక్ వాపోయారు. జంపన్నవాగు ఉధృతిగా ఉండడంతో జిల్లా ఎస్పీ గాష్ ఆలం, ఓఎస్డీ అశోక్, ఎ మ్మెల్యే సీతక్క, జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణిల చొరవతో పడవల ద్వారా ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో మృతదేహాలను మార్చురీకి తరలించారు.

వడ్డేపల్లి రైల్వే ట్రాక్‌పై గస్తీ

కాజీపేట రూరల్ : కాజీపేట వడ్డేపల్లి రైల్వే ట్రాక్‌పై రైల్వే అధికారులు శుక్రవారం ట్రాక్ గస్తీని పెట్టారు. వర్షాలకు గురువారం వడ్డేపల్లి రైల్వేట్రాక్ వద్దకు వరద నీటి ఉధృతి పెరగడంతో ట్రాక్ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని అధికారులు రైళ్లను ఈ ట్రాక్‌మీదుగా రద్దు చేసి రాత్రి 10 గంటల తర్వాత తక్కువ వేగంతో పునరుద్ధరించారు. శుక్రవారం ఇంజనీరింగ్, బ్రిడ్జి విభాగం రైల్వే అధికారులు సిబ్బందిని ట్రాక్‌వద్ద గస్తీ పెట్టారు. వర్షం పడి ట్రాక్‌కు వర్షం నీరు తాకడంతో గస్తీ చేసే వారి సమాచారంతో రైళ్లను ఈ ట్రాక్‌పై నుంచి రద్దు చేసేలా చర్యలు తీసుకున్నారు. వరద ఉధృతికి ట్రాక్ ఏమైనా దెబ్బతిని ఉండవచ్చని రైల్వే ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతు చేసి రైళ్ల స్పీడ్ పెంచేలా చర్యలు తీసుకున్నారు.

బిక్కుబిక్కుమంటూ గడిపాం



మల్యాల, కొండాయి ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు



నీటిలో మంచం మోసుకొస్తున్న బాధితుడు

- 24 గంటలు ప్రాణాలు అరచేతిలోనే
- నీట మునిగిన వందలాది ఇళ్లు

ఏటూరునాగారం : జంపన్నవాగు వరద, పెద్ద చెరువు పోటెత్తడం, జంపన్నవాగు వద్ద నిర్మించిన కరకట్ట తెగిపోవడంతో మండలంలోని కొండాయి, మల్యాల గ్రామాల్లోని ఇళ్లు నీట మునిగాయి. 24 గంటల పాటు వరద నీటిలోనే సుమారు 200 మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని భవనాలు ఎక్కి తలదాచుకున్నారు. మల్యాల ఆశ్రమ పాఠశాలలోకి కూడా వరద రావడంతో భవనం పైనే ఉండిపోయారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆ రెండు గ్రామాల్లో అనేక మంది ప్రజలు నానా అవస్థలు పడుతూ దేవుడిని వేడుకుంటూ బతికి బయటపడ్డారు. దళిత కాలనీలోని 40 ఇళ్లు నేలమట్టమయ్యాయి. అలాగే దొడ్లలో కూడా ఇళ్లు కూలిపోయాయి. ఇంకా మల్యాల, కొండాయి గ్రామాల్లో శుక్రవారం సైతం వరద నీరు ఉండడంతో ప్రజలు వణికిపోతున్నారు.

బతుకుతామని ఆశ లేదు



పుట్టిననాటి నుంచి ఇప్పటి వరకు ఇంత వరద చూడలేదు. బతుకుతామని అనుకోలేదు. దేవుడి దయతో బతికి బయటపడ్డాం. మా బంధువులు చనిపోయారు. వరదలు తట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది.

- అంకూస్‌బీ, కొండాయి వరద బాధితురాలు

భవనంపైనే ఉన్నా



రాత్రి అంతా భవనంపైనే ఉన్నా. మా ఇళ్లు కొండాయిలో ఉంది. వరద వస్తుందని మల్యాల ఆశ్రమ పాఠశాల భవనం పైకి ఎక్కి కూర్చొని ఉన్నా. నా ప్రాణాలను కాపాడుకున్నా. కానీ మా బంధువులు చనిపోయారు. దేవుడు అన్యాయం చేశాడు. చాలా భయంతో గడిపాం.

- ఎండి సల్మాన్‌ఖాన్, కొండాయి